సాక్షి జగిత్యాల

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



విష జ్వరాల పంజా

జగిత్యాల జిల్లాలో విషజ్వరాలతో జనం విలవిల్లాడుతున్నారు. పరిస్థితి విషమించి, సోమవారం ఒక్కరోజే నలుగురు మృతిచెందారు.

- 8లో ▸



బస్తీ దవాఖానా తనిఖీ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్ బస్తీ దవాఖానాను సోమవారం డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం 27.0/24.0

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమవుతుంది. తేలికపాటి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ఎస్పీ అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న శాస్త్రీ యువజన సంఘం సభ్యులు

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి పట్టణంలోని పలు వినాయక మండపాలను సోమవారం రాత్రి ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో పూజలు చేశారు. అలాగే నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నవరాత్రోత్సవాలతో పాటు నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవి ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

కోరుట్లరూరల్: గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు విద్యుత్, అగ్నికి సంబంధించి జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలో పలు గణేశ్ మండపాలను పరిశీలించారు. ఎస్పీ వెంట మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ సురేశ్ బాబు, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

నిండుకుండలా ఎస్సారెస్పీ



జగిత్యాలరూరల్: జిల్లాకు సాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి వస్తున్న వరదను 5 గేట్లు ఎత్తి కిందకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,090.90 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 80.053 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 42,515 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. కాకతీయ మెయిన్ కెనాల్‌కు 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ ద్వారా 4 వేల క్యూసెక్కులు, వరద కాల్వకు 18 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్

జగిత్యాల: నాయబ్ తహసీల్దార్లు ఇటీవల తహసీల్దార్లుగా పదోన్నతి పొందారు. వారికి పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. కథలాపూర్ తహసీల్దార్‌గా బి.వినోద్‌ను నియమించగా అక్కడ పనిచేస్తున్న ఎంకె.ముతాజీబోద్దీన్‌ను బీర్‌పూర్‌కు బదిలీ చేశారు. పెగడపల్లి తహసీల్దార్‌గా బి.రవిందర్‌ను నియమించగా, అక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్‌ను మెట్‌పల్లికి బదిలీ చేశారు. జగిత్యాల రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాంమోహన్‌ను అర్బన్ తహసీల్దార్‌గా నియమించారు. సారంగాపూర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రమేశ్‌ను కొడిమ్యాలకు బదిలీ చేశారు. కొడిమ్యాల తహసీల్దార్ రాజమణిని కోరుట్ల ఏవోగా బదిలీ చేశారు.

దుబ్బరాజన్న హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది, భక్తులు

సారంగాపూర్(జగిత్యాల): ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయ హుండీ ఆదాయం రూ.14,26,813 సమకూరింది. సోమవారం ఆలయ ఆవరణలో శ్రావణమాసం అనంతరం జరిగిన లెక్కింపులో రూ.13,21,725 నోట్ల రూపంలో, రూ.1,05,088 నాణెముల రూపంలో ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకుడు రాజమౌళి, ఆలయ ఈవో కొస్న కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, నాయకులు కోల శ్రీనివాస్, కొంఢ్ర రాంచంద్రారెడ్డి, తోడేటి శేఖర్‌గౌడ్, వాసం శ్రీనివాస్, చిందం శ్రీనివాస్, కొలపాక రవి, పంగ కిష్టయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

జగిత్యాల: నూకపల్లి డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 17 వరకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. లబ్ధిదారులు కులధ్రువీకరణ, ఆదాయ సర్టిఫికెట్లు తెచ్చుకోవడంలో జాప్యం వల్ల నష్టపోకుండా ఉండేందుకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. అన్ని డాక్యుమెంట్లు ఉండాలని, లేకుంటే దరఖాస్తులు తిరస్కరించబడతాయని తెలిపారు. మీసేవ కేంద్రాల్లో అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దరఖాస్తులు స్వీకరించాలని నిర్వాహకులను ఆదేశించారు.

కాల్వలు కబ్జా

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రధాన నాలాలు, డ్రైనేజీలు, శిఖం భూములు కబ్జాకు గురికావడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇళ్లలోకి నీరు చేరుతోంది. నాలాలు కబ్జాకు గురైనా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జగిత్యాల జిల్లాగా ఆవిర్భవించక ముందు ధరూర్, మోతె ప్రాంతాల్లో వాగును కబ్జా చేసి ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టగా అప్పటి సబ్ కలెక్టర్ శశాంక నక్ష ప్రకారం ఆక్రమణలు కూల్చివేసి వాగును పునఃనిర్మించారు.

- జిల్లా కేంద్రంలో యథేచ్ఛగా ఆక్రమణలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పట్టించుకోని అధికారులు



మోతె ప్రాంతంలో కబ్జాకు గురైన వాగు



జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాల ఎదుట డ్రైనేజీపై కట్టడాలతో కుదించుకుపోయిన కాలువ

- మళ్లీ ధరూర్, మోతె ప్రాంతాల్లో వాగు కబ్జాలకు గురికావడంతో వర్షాకాలంలో వరద నీరు ఎటు వెళ్లక రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఇటీవల వర్షాలకు వాగు సమీపంలోని వెంకటాద్రినగర్ కాలనీ మొత్తం జలమయమై పక్కనే ఉన్న బ్రిడ్జి ఉప్పొంగడంతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి.
- ఈక్రమంలో ఆ కాలనీవాసులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. దీంతో పాటు భవానినగర్, కృష్ణానగర్, విద్యానగర్, వెంకటాద్రినగర్‌లో నాలాలపైనే షాపులు, నివాసాలు కట్టడంతో సుమారు 12 ఫీట్లు ఉండాల్సిన కాలువ ప్రస్తుతం 2–3 ఫీట్లకే పరిమితమైంది.
- వర్షపునీరు సక్రమంగా వెళ్లకపోవడంతో పాటు, అందులో పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయి సమీప కాలనీలు జలమయం అవుతున్నాయి.
- టవర్‌సర్కిల్ ప్రాంతంలో డ్రెయినేజీలపైనే నిర్మాణాలు చేపట్టడంతో కాల్వల్లో మట్టి కూరుకుపోయి మురికినీరు వర్షాలకు ఎటు వెళ్లక ఇళ్లలోకి వస్తోందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- విద్యానగర్, కృష్ణానగర్, మోతెరోడ్ తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో లేఅవుట్ లేకుండానే ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో వరదనీరు ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.
- ఖాళీ స్థలాల్లోకి డ్రైనేజీ, వర్షపు నీరు వెళ్లడం, కొందరు స్థల యజమానులు ప్రహరీలు నిర్మించుకోవడతోం ఆ నీరు రోడ్లపై ప్రవహిస్తూ లోతట్టు ప్రాంతాలను ముంచుతున్నాయి. ఇష్టానుసారంగా ఇంటి అనుమతులు ఇవ్వడంతో ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలున్నాయి.
- చెరువులు సైతం పూర్తి కబ్జాకు గురవుతున్నాయి. పట్టా భూములు అయినప్పటికీ ఎఫ్‌టీఎల్ భూముల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టరాదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడంతో చిన్నపాటి వర్షాలకే సదరు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి.

పట్టింపులేని అధికారులు

- మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు నిబంధనల ప్రకారం అన్నింటినీ పరిశీలించి ఇవ్వాలి. కానీ, గతంలో మ్యాన్యువల్ పద్ధతి ఉండటం, ఆన్‌లైన్ లేకపోవడంతో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు అమ్యామ్యాలకు కక్కుర్తిపడి ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వడంతో ఈ సమస్యలు ఏర్పడుతున్నాయి. కొందరు ఒక ప్లాన్ మీద అనుమతి తీసుకుని వారి ఇష్టానుసారంగా నిర్మించడం జరుగుతోంది. యథేచ్ఛగా డ్రైనేజీలు, నాలాలు కబ్జా చేసి ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాకు గురైన నాలాలు, డ్రైనేజీలపై కట్టిన ఇంటి నిర్మాణాలను కూల్చివేస్తే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉద్యమమే ఊపిరిగా జీవించిన కవి కాళోజీ



కాళోజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు, సిబ్బంది

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: ఉద్యమమే ఊపిరిగా జీవించి కవి కాళోజీ అని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ భాషకు అస్తిత్వ స్పృహను పెంచడంలో కాళోజీది కీలకపాత్ర అన్నారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మ విభూషణ్ బిరుదుతో సత్కరించిందని వివరించారు. తెలుగు భాష పట్ల ఆయనకు ఎనలేని అభిమానం ఉండేదని, అందుకే ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాంబాబు, ఏవో హన్మంతరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను భాగస్వామ్యం చేయాలి

పోషణ మాసోత్సవాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. పోషణమాసాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో పోషకాహార విశిష్టత గురించి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. సంక్షేమాధికారి డాక్టర్ నరేశ్ మాట్లాడుతూ, పిల్లల్లో లోప పోషణ నివారించి పోషణస్థాయిని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం పోషకాహారం గురించి ఏర్పాటు చేసిన ప్రదర్శనలను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి, సీడీపీవోలు పాల్గొన్నారు.

నేనూ రైతునే.. వ్యవసాయం చేస్తా

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): 'నేను కూడా రైతునే.. స్వయం వ్యవసాయం చేస్తున్నా.. రైతుల సమస్యలు ఎలాంటివో అవన్నీ బాగా తెలుసు' అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని రైతు మిత్ర ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని తెలిపారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు పంటలకు సంబంధించిన రైతుమిత్ర ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌లో అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, మందులు నాణ్యతతో పాటు, తక్కువ ధరకు లభిస్తాయని వివరించారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి రాజరెడ్డి, అత్తినేని గంగారెడ్డి, తంగేళ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రైతుమిత్ర ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సభ్యులతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

విషజ్వరాలకు భయాందోళన వద్దు



మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్

- వైద్య రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: జిల్లాలో పెరుగుతున్న విష జ్వరాలపై ప్రజలు భయపడాల్సిన పనిలేదని, వైద్య రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్ అన్నారు. సోమవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ధర్మపురిలో మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రెస్‌మీట్ పెట్టి అనేక అంశాలపై అసత్య ప్రచారం చేశారని, వాటిని పూర్తిగా ఖండించారు. కరోనా సమయంలో హైదరాబాద్, కరీంనగర్‌లలో రోగులకు బెడ్లు దొరకని పరిస్థితి నెలకొందని, అప్పుడు మన ప్రాంతానికి చెందిన ఎంత మంది కరోనా బాధితులను ఆదుకున్నారో చెప్పాలని డిమాండు చేశారు. ప్రస్తతం విష జ్వరాల బారినపడినవారికి అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని, ఆస్పత్రిని స్వయంగా సందర్శించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరుగుతుందన్నారు. ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన మాతాశిశు ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావడానికి సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. సమావేశంలో నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజు, చిలుముల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు ఇవ్వొద్దు

బుగ్గారం(ధర్మపురి): బుగ్గారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసే డిటోనేటర్ల(పేలుడు పదార్థాల) నిల్వ గోదాముకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వద్దని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పలువురు సోమవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్‌కు వేర్వేరుగా వినతి పత్రాలు అందించారు. ఈ క్రమంలో పర్యావరణానికి హాని కల్గించే పనులను చేయబోనీయమని విప్ అడ్లూరి హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నక్క చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన



సదస్సులో సూపరింటెండెంట్ రాములు, వైద్యులు తదితరులు

జగిత్యాల: ఆత్మహత్య ఆలోచనలను నివారించవచ్చని, కుటుంబ సభ్యులు, మిత్రులు గుర్తించవచ్చని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరుచూ ఆత్మహత్యల గురించి మాట్లాడటం, నిరాశగా ఉండటం, ఇంటర్నెట్‌లో నిద్రమాత్రలు, పురుగుల మందులు సేకరించడం, ఇతరులకు భారంగా ఉన్నామని మాట్లాడటం, ఆతృత లేదా ఆందోళనగా ఉండటం, తీవ్ర మానసిక ఒత్తిడికి గురవడం లాంటివి ఎక్కువగా ఉంటాయని, ఇవి పసిగట్టి ఆత్మహత్యలు నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంచి మిత్రుడు, కుటుంబ సభ్యులతో సమస్యలను చెప్పుకోవాలని, దీంతో ఆత్మహత్య ఆలోచనలు రావన్నారు. ముఖ్యంగా జీవనశైలి మార్చుకోవడం వల్ల అనేక మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశాల్, రెడ్‌క్రాస్ సొసైటీసభ్యులు మంచాల కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జన వేడుకలో మహిళలు

అమెరికాలో వినాయక నిమజ్జనం

అమెరికా విస్కన్సిన్ స్టేట్‌లోని సన్ ప్రైరీలో తెలుగువారంతా కలిసి ప్రతిష్టించిన గణనాథునికి సోమవారం వీడ్కోలు పలికారు. పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేశారు. అనంతరం లడ్డూను వేలం వేయగా సంతోష్ ఉష రూ.లక్షకు దక్కించుకున్నారు. వేడుకల్లో జగిత్యాల జిల్లాకు చెందిన అభిషేక్ సింధుజ, సంతోష్ ప్రణయ, ప్రసాద్ రమ్య, క్రాంతి కవిత తదితరులు పాల్గొన్నారు. - రాయికల్(జగిత్యాల)

ప్రజావాణికి వినతుల వెల్లువ

- సమస్యలు సత్వరం పరిష్కరించండి
- కలెక్టర్ సత్యప్రసాద్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి 61 దరఖాస్తులు రాగా కలెక్టర్ బి.సత్యప్రసాద్ స్వీకరించారు. దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతంరెడ్డి, జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు పులి మధుసూదన్ గౌడ్, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్, ట్రైసైకిల్ ఇప్పించండి



జగిత్యాలటౌన్: రెండు కాళ్లు లేని తనకు పెన్షన్‌తో పాటు ఎలక్ట్రిక్ ట్రైసైకిల్ ఇప్పించి ఆదుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు దివ్యాంగుడు బోదాసు సాయిలు మొరపెట్టుకున్నాడు. కథలాపూర్ మండలం సిరికొండకు చెందిన సాయిలు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ వాహనం వద్ద బైఠాయించాడు. కలెక్టర్ ప్రజావాణిలో ఉన్నారన్న సమాచారం మేరకు ఆయన వచ్చే వరకు బాధితుడు అక్కడే వేచి ఉన్నాడు. ప్రజావాణి ముగించుకుని బయటకు వచ్చిన కలెక్టర్, సాయిలు సమస్యను తెలుసుకున్నారు. బాధితుడికి న్యాయం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి భోనగిరి నరేశ్‌ను ఆదేశించారు.

రుణమాఫీ చేసి ఆదుకోండి



ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో మాకు మాఫీ కాలేదు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తానన్న ప్రభుత్వ హామీ మేరకు అర్హత ఉన్న మాకు రుణమాఫీ అమలు చేసి న్యాయం చేయాలి. – జిల్లాలోని పలువురు రైతులు

రైస్‌మిల్ నిర్మాణం ఆపాలి



వెంగళాపూర్ గ్రామంలోని జనావాసాలకు సమీపంలో కొందరు వ్యక్తులు నిర్మించతలపెట్టిన బాయిల్డ్ రైస్‌మిల్‌తో మా పంటపొలాలు దెబ్బతినడంతో పాటు వాయు కాలుష్యం ఏర్పడి జనజీవనానికి నష్టం కలుగుతుంది. రైస్‌మిల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులందరం పంచాయతీ కార్యదర్శికి తీర్మానం కూడా ఇవ్వడం జరిగింది. మాకు ప్రమాద కరంగా పరిణమించనున్న రైస్‌మిల్ నిర్మాణం ఆపాలి.

– వెంగళాపూర్ గ్రామస్తులు

సమాధులు కూల్చొద్దు



పెగడపల్లి మండలం నంచర్ల గ్రామంలో వందేళ్లుగా తమ పూర్వీకులను పూడ్చిపెడుతున్న సమాధులను రాగి మహేశ్ అనే వ్యక్తి జేసీబీతో కూల్చివేశాడు. మేము దైవంగా భావించే మా పూర్వీకుల సమాధులను కూల్చివేసి మా మనోభావాలను దెబ్బతీసిన మహేశ్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలి. – నంచర్ల గ్రామస్తులు

పోడు భూములు..



గత ప్రభుత్వం సర్వే నిర్వహించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గిరిజన పోడు దారులకు పోడు పట్టాలు మంజూరు చేయడం జరిగింది. అలాగే కథలాపూర్ మండలంలో 9 తండాలకు చెందిన 400మంది గిరిజన పోడు సాగుదారులను గుర్తించిన ప్రభుత్వం కేవలం ఒక్కరికి మాత్రమే పట్టా ఇచ్చింది. మిగతా 399మందిని పక్కన పెట్టింది. మిగిలినవారికి పోడు పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలి. – కథలాపూర్ మండలంలోని 9తండాల గిరిజనులు

నిలువ నీడ లేకుండా చేస్తున్నారు



గంభీర్‌పూర్ గ్రామ పరిధి సర్వే నంబర్ 570లోని ప్రభుత్వ భూమిలో కొన్నేళ్లుగా గ్రామస్తులకు చెందిన ఆవులు, గేదెలు, గొర్లు, మేకలు మేపడం జరుగుతుంది. ఇట్టి భూమిని ఇటీవల కొందరు ఆక్రమించి హద్దులు ఏర్పాటు చేసి సాగుచేస్తూ అందులోకి పశువులను రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి పశువులకు నిలువ నీడలేకుండా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి. – గంభీర్‌పూర్ గ్రామస్తులు

చెరువులు, కుంటలను కాపాడాలి



మల్యాల పరిధిలోని మత్తడి చెరువు, సూరప్ప చెరువులలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో సాగుతున్న ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి. హైడ్రా లాంటి వ్యవస్థను ఏర్పాటు చేసి నీటి వనరులను పరిరక్షించి మత్స్యకారులైన తమ ఉపాధిని కాపాడాలి.

– మల్యాల మత్స్యకారులు

సెల్ టవర్ నిర్మాణం ఆపాలి



జగిత్యాల పట్టణంలోని 20వ వార్డులో ఇంటి నంబర్ 1-2-31 సమీపంలోని ఖాళీ స్థలంలో ఇండస్ సంస్థకు చెందిన సెల్ టవర్ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారు. చాలా తక్కువ స్థలంలో నిర్మించతలపెట్టిన టవర్ నుంచి వెలువడే రేడియేషన్‌తో కాలనీవాసులకు అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున సెల్ టవర్ నిర్మాణం నిలిపివేసి మా ఆరోగ్యాన్ని కాపాడాలి.

– జగిత్యాల పట్టణ 20వ వార్డు ప్రజలు

క్లుప్తంగా

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య


మల్లేశం (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం గ్రామానికి చెందిన గోనె మల్లేశం(45) జీవితంపై విరక్తి చెంది సోమవారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. మల్లేశం రెండేళ్లుగా కడుపు నొప్పితో పాటు ఇతర శారీరక సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయంకాలేదు. మానసికంగా కుంగి, జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం దాదాపు 5 గంటల సమయంలో తన ఇంట్లోని రేకుల షెడ్ ఇనుపరాడ్‌కు టవల్‌తో ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

నరేందర్‌రెడ్డికే ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలి

- రెడ్డి జేఏసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కర్ర శ్రీధర్ రెడ్డి


మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

హుజూరాబాద్: అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డికే పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని రెడ్డి జేఏసీ విద్యార్థి విభాగం కర్ర శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం హుజూరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యావేత్త నరేందర్‌రెడ్డికి అన్ని జిల్లాల్లో రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. విద్యావ్యవస్థపై పూర్తి అవగాహన ఉందని, కష్టకాలంలో కాంగ్రెస్ కోసం పని చేశారన్నారు. ఆయనకు టికెట్ ఇస్తే పార్టీలకతీతంగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని, ముందస్తుగా టికెట్ ప్రకటించాలని కోరారు.

భక్తుల ముసుగులో దొంగలు

- వినాయక విగ్రహంపై కరెన్సీ మాల అపహరణ

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ పంచాయతీ పరిధి ఎల్ఎండీ కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల ముసుగులో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని భక్తులు కరెన్సీ మాలతో అలంకరించారు. దీన్ని గమనించిన దొంగలు ఆదివారం రాత్రి కరెన్సీమాలతోపాటు మండపంలో ఉన్న నగదును సైతం అపహరించారు. అనంతరం హుండీ పగలగొట్టేందుకు విఫలయత్నం చేశారు. అక్కడి నుంచి పక్కనే ఉన్న శివాలయంకు వెళ్లి అక్కడ ఏమీ లభించకపోవడంతో వినాయక విగ్రహం రాగి తొండంను ఎత్తుకెళ్లారు. అమ్మవారి బంగారు నగలు అనుకొని తీసుకెళ్లారు. మూడు రోజుల క్రితం తాపాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని హనుమాన్ ఆలయం హుండీలోని నగదు దొంగిలించినట్లు తెలిసింది. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

తుప్పు పట్టాల్సిందే

- ఇసుక అక్రమ దందాపై ఉక్కుపాదం
- జగిత్యాల జిల్లా కోరుట్ల తహసీల్ కార్యాలయంలో 20 రోజులుగా ట్రాక్టర్లు
- రాజకీయ ఒత్తిళ్లకు యత్నాలు

కోరుట్ల: ఒకటి, రెండు రోజులు కాదు.. ఏకంగా 20 రోజులు.. ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు చేయించే యత్నాలు చేస్తున్నా ఫలితం లేదు. ఇసుక అక్రమ రవాణాపై భారీగా పెంచిన మేర జరిమానాలు కడతామని ఇసుక అక్రమ రవాణాదారులు కాళ్లబేరానికి వచ్చినా పట్టించుకునే నాథుడు లేడు. జిల్లా కలెక్టర్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేవరకు ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ల పరిస్థితి అంతే. తహసీల్దార్ కార్యాలయంలోనే ట్రాక్టర్లు రోజుల తరబడి నిలిచిపోయి తుప్పు పట్టాల్సిందే. ఇసుక దందాపై అధికార యంత్రాంగం నిక్కచ్చిగా చర్యలు తీసుకున్న ఫలితం ఇది.


కోరుట్ల తహసీల్ కార్యాలయంలో ఇసుక ట్రాక్టర్లు

అడ్డగోలు రవాణాకు చెక్

జగిత్యాల జిల్లా కోరుట్ల, కథలాపూర్, మల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తరలించడం ఆనవాయితీగా మారింది. ఓ ట్రాక్టర్ కొనుగోలు చేస్తే చాలు.. ఇసుక అక్రమ రవాణా చేస్తూ అడ్డగోలు సంపాదించవచ్చన దురాశ పెరిపోయింది. కోరుట్ల మండలం పైడిమడుగు, నాగులపేట, కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి వాగు శివారు, మల్లాపూర్ మండలంలోని రేగుంట, వేంపల్లి–వెంకట్రావ్‌పేట తదితర ప్రాంతాల్లో పదేళ్లుగా అడ్డగోలుగా ఇసుక రవాణా కొనసాగింది. చివరికి ఇసుక రవాణాదారులు అడ్డుకోవడానికి యత్నించిన అధికారులపైనే దాడులకు దిగిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాదారులు సిండికేట్లుగా మారి రవాణా కోసం కొత్తగా ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్న వారికి సభ్యత్వ రుసుం తీసుకునే స్థాయికి దిగజారిపోయాయి. అధికారులకు మామూళ్లు ఇవ్వాలంటూ సభ్యుల దగ్గర డబ్బులు వసూలు చేయడం వివాదాస్పదంగా మారుతోంది. ఈ పరిస్థితిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న గ్రామాల్లో రోడ్లు దెబ్బతినడం, ట్రాక్టర్లతో ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు ప్రాణాలు కోల్పోవడం సమస్యాత్మకంగా మారింది. ఈనేపథ్యంలో ఉన్నతాధికారులు అక్రమ ఇసుక రవాణాపై కొరడా ఝులిపించడంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. ఒక్క కోరుట్ల తహసీల్దార్ కార్యాలయం లోనే ఇరవై రోజులుగా 22 ఇసుక ట్రాక్టర్లు మూలుగుతున్నాయి. మరో 21 ట్రాక్టర్లను ఆర్టీసీ డిపోకు తరలించారు. కోరుట్ల, కథలాపూర్ పరిసరాల్లో కొన్ని గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా దాదాపుగా నిలిచిపోయింది.

రాజకీయ ఒత్తిళ్లకు యత్నాలు

గత 20 రోజులుగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు తహసీల్దార్ కార్యాలయంలోనే మగ్గుతుండటంతో అక్రమ రవాణాదారులు ప్రతీ రోజు కార్యాలయానికి వెళ్లి తమ ట్రాక్టర్లు వదిలిపెట్టాలని కోరుతున్నా ఫలించడం లేదు. చివరికి కీలక రాజకీయ నేతలతో అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని యత్నిస్తున్నా ఆశించిన ఫలితం లేదు. అక్రమ ఇసుక రవాణాకు సహకరిస్తే గ్రామీణ ప్రజానీకంలో బద్‌నాం వస్తుందన్న కారణంగా వారు అక్రమ ఇసుక రవాణా విషయంలో ఏలాంటి జోక్యం చేసుకోవడం లేదు. అయితే ఈ దందా ఆగిపోవడంతో కొంత మంది ఇళ్ల నిర్మాణదారులు ఇసుక కోసం ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడ గుట్టచప్పుడు కాకుండా అక్రమంగా తరలివస్తున్న ఇసుకను అధిక ధరలు పెట్టి కొనుగోలు చేయాల్సివస్తుంది. అక్రమ ఇసుక రవాణాను నిలిపేయడంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న అధికారులు ఇళ్ల నిర్మాణాలు చేసుకునే వారికి రీచ్‌ల నుంచి ఇసుకను సరాఫరా చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విష జ్వరాల పంజా

- జగిత్యాల జిల్లాలో నలుగురు మృతి


రాంచంద్రం (ఫైల్)

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లాలో విషజ్వరాలతో జనం విలవిల్లాడుతున్నారు. సోమవారం ఒక్కరోజే నలుగురు మృతిచెందారు. వివరాలు.. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన ఏనుగుల రాంచంద్రం (55) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. అలాగే తిప్పన్నపేట గ్రామానికి చెందిన పోతుల రాజన్న (80) తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఒకే గ్రామంలో ఇద్దరు మృతిచెందడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.


రాజన్న (ఫైల్)

ధర్మపురిలో విద్యార్థి..


రాంచరణ్ (ఫైల్)

ధర్మపురి: ధర్మపురిలోని హన్మాన్‌వాడకు చెందిన గజ్జెల నాగరాణి– గంగాధర్ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు రాంచరణ్ (10) స్థానిక ప్రైవేట్ స్కూల్‌లో 4వ, తరగతి చదువుతున్నాడు. వా రం నుంచి జ్వరంతో బాధపడుతుండగా స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ 3 రోజుల పాటు వైద్యం అందించగా పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్క డ రెండు రోజుల పాటు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా, కుమారుడి వైద్యం కోసం రూ.3 లక్షల వరకు ఖర్చు అయినట్లు, మరో రూ.70 వేలు చెల్లిస్తేనే మృతదేహాన్ని అప్పజెపుతామని వైద్యులు పేర్కొన్నట్లు బాధితులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే వైద్యం వికటించి బాబు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి మృతి?

వెల్గటూర్(ధర్మపురి): ఆర్ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి మృతిచెందిన ఘటన వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో జరిగింది. గ్రామస్తులు, కుటుంబసభ్యుల వివరాలు.. గ్రామానికి చెందిన అవ్వ లింగమూర్తి (45) విషజ్వరంతో బాధపడుతూ శుక్రవారం గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు చికిత్స నిమిత్తం వెళ్లాడు. రో గిని పరీక్షించిన ఆర్ఎంపీ ఇంజెక్షన్‌తో పాటు సెలైన్ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. సెలైన్ ఎక్కించగానే విపరీతమైన చలితో జ్వరంతో లింగమూర్తి అక్కడే కుప్పకూలిపోయాడు. ఈక్రమంలో గ్రామస్తుల సహకారంతో లింగమూర్తిని సదరు ఆర్ఎంపీ జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. జ్వరం తలకెక్కడంతో నాలుగు రోజులుగా హాస్పిటల్లో కదలిక లేకుండా ఉండి సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. కాగా, సదరు ఆర్ఎంపీ వచ్చీ రాని వైద్యంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డట్లు గ్రామంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్న ఆర్ఎంపీపై చర్యలు తీసుకొని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


లింగమూర్తి (ఫైల్)

స్కూళ్లలో తెలంగాణ భాషా దినోత్సవం


కాళోజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి, విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ యాసకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే కాకుండా రాష్ట్ర సాధనకు తన రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారని కొనియాడారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బిర్లా స్కూల్లో నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, టీచర్లు, విద్యార్థులు..

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో సోమవారం తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. విద్యార్థులు కాళోజీని స్మరించుకుంటూ పాటలు, ఆటలతో అలరించారు. కాళోజీ తెలంగాణ భాష, యాసకు గుర్తింపు తీసుకువచ్చారని చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ యాసకు చిరునామా 'నలిమెల'

కరీంనగర్ కల్చరల్: కాళోజీ సాహితీ పురస్కారానికి ఎంపికైన కరీంనగర్ ముద్దుబిడ్డ, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్ తెలంగాణ భాష, యాసకు చిరునామా అని తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షుడు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి కొనియాడారు. సోమవారం ఆయనను కరీంనగర్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా నలిమెల భాస్కర్ మాట్లాడుతూ.. కాళోజీ పురస్కారానికి తాను ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సంఘం కార్యదర్శి, కవి బొమ్మకంటి కిషన్, కార్యవర్గ సభ్యురాలు, కవయిత్రి అనిత, సభ్యులు తుమ్మల రమేశ్ రెడ్డి, ఎం.మహేందర్, పి.సురేందర్, కె.సత్యం తదితరులున్నారు.


సన్మానిస్తున్న మధుసూదన్‌రెడ్డి, సంఘం బాధ్యులు

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు


సత్యనారాయణ

కరీంనగర్: మంథని మున్సిపల్ పరిధిలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇనుముల సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన మందల మల్లారెడ్డికి 302 గజాల ఇంటి స్థలం ఉంది. మున్సిపల్ నుంచి అనుమతి పొంది అందులో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఇనుముల సత్యనారాయణ తనకు రూ.5లక్షలు మామూలు ఇవ్వాలని, లేకుంటే నిర్మాణాన్ని అడ్డుకుంటానని యజమానిని బెదిరించారు. అంతేకాదు.. మున్సిపల్ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇటీవల హైకోర్టును ఆశ్రయించి నిర్మాణానికి ఆటంకాలు లేకుండా ఉత్తర్వులు పొందారు. అయితే, సత్యనారాయణ గన్‌మెన్‌తో వచ్చి డబ్బులు ఇవ్వకపోతే.. ఇంటిని కూల్చివేయిస్తానని, గతంలో హైకోర్టులో పిల్ వేసి చాలా ఇళ్లు కూల్చివేయించానని బెదించారు. ఈక్రమంలో గత ఆగస్టు 20న బాధితుడు రూ.రెండు లక్షలు చెల్లించారు. మిగతా సొమ్ము కోసం సత్యనారాయణ బెదిరిస్తున్నారు. గతంలోనూ ఇలా అనేక మందిని ఇబ్బందులకు గురిచేసి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేశారని, బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

గోడ తడిసి చిన్నారికి విద్యుత్‌షాక్

- కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూంలో ఘటన
- తల్లిదండ్రుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో సోమవారం ఓ చిన్నారి విద్యుత్‌షాక్‌కు గురికాగా ప్రాణాపాయం తప్పింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. కేసీఆర్‌నగర్ బ్లాక్ నంబర్ 90లో నివసిస్తున్న కొలిపాక రాము–రూప దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు ఏడేళ్ల వయసున్న లాస్య సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లేందుకు తయారై ఇంటి ఆవరణలో గోడపక్కన విడిచిన చెప్పులు వేసుకునేందుకు గోడను ముట్టుకుంది. అదే గోడకు కరెంటు మీటర్లు అమర్చి ఉండడం.. ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిపోవడంతో చిన్నారి విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన సమీపంలో ఉన్న మమత అనే మహిళ పాపను రక్షించేందుకు ప్రయత్నించగా ఆమె సైతం విద్యుత్‌షాక్‌కు గురైంది. ఇద్దరిని రక్షించేందుకు వచ్చిన చిన్నారి తల్లి రూపకు కూడా షాక్ రావడంతో సమయస్ఫూర్తితో వ్యవహరించి కర్ర సాయంతో చిన్నారిని పక్కకులాగి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం ఏమి లేదని వైద్యులు తెలపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి లాస్య

'ఈ వంట మనుషులు మాకొద్దు'

ధర్మపురి: 'మధ్యాహ్న భోజనం రుచిగా లేదు.. ఈ వంట మనుషులు మాకొద్దు' అంటూ విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిపోయిన ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం ఆరెపెల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. వివరాలు.. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతులు నిర్వహిస్తున్నారు. హెచ్ఎం మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 55 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే, గత రెండేళ్ల నుంచి మధ్యాహ్న భోజనం సరిగా వండడం లేదని, పురుగుల అన్నం, నీళ్ల సాంబారు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని నిర్వాహకులను ఇటీవల పక్కనపెట్టారు. అయినా సదరు నిర్వాహకులు సోమవారం పాఠశాలకు వచ్చి ఇబ్బందులకు గురి చేయడంతో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లారు. ఈక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య వాగ్వాదం జరిగింది. వండిన మధ్యాహ్న భోజనం వృథాగా పడేశారు. కాగా, పాత వంట మనుషులు పసుపు, బియ్యం కలిపి పాఠశాల చుట్టూ పోయడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారని తల్లిదండ్రులు వాపోయారు.


విద్యార్థులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

కాలేజీకి వాటర్ డిస్పెన్సర్ వితరణ

కరీంనగర్: సేవ చేయడం వల్ల తృప్తితోపాటు గుర్తింపు లభిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని ముకరంపుర ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సోమవారం వాటర్ డిస్పెన్సర్ వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సేవాభావానికి సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు పాల్గొన్నారు.


వాటర్ డిస్పెన్సర్ అందిస్తున్న నరేందర్‌రెడ్డి

విదేశీ విద్య స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఎస్సీ విద్యార్థుల కోసం 2024–25 సంవత్సరానికి గానూ ప్రవేశపెట్టిన జాతీయ విదేశీ విద్య ఉపకార వేతనానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎం.నాగైలేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంతో విదేశాల్లో పీజీ, పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం ఉంటుందని, జిల్లా నుంచి 125 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. www.nosmsje.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల వయసు ఏప్రిల్ 1 నాటికి 35 ఏళ్లు మించకూడదని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.8 లక్షల్లోపు ఉండాలని తెలిపారు. డిగ్రీలో 60 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఒక కుటుంబం నుంచి మొదటిసారి ఒకరికి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరంలో ఖాళీలు ఉంటే రెండో విద్యార్థికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఏడాదికి రెండుసార్లు చాన్స్ ఉంటుందన్నారు. మొదట ఫిబ్రవరి నుంచి 45 రోజులు, తర్వాత సెప్టెంబర్ 1 నుంచి 45 రోజులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఉపసంచాలకులు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖను 97040 11827 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయానికి ఆరాధ్యుడు బలరామదేవుడు

- భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రంగారావు

మల్లాపూర్(కోరుట్ల): వ్యవసాయానికి ఆరాధ్యుడు బలరామదేవుడని భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ రంగారావు అన్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్మించిన బలరామ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర రైతు సంఘటన ప్రముఖ్ దోనూరి రాము, అఖిల భారత విద్యుత్ కార్యదర్శి పర్యాద ముదిగొండ శ్రీధర్‌రెడ్డి, భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పర్యాద అంజిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బలరామ దేవుడు అవలంభించిన వ్యవసాయ విధానాలతోనే మనదేశం వ్యవసాయానికి పుట్టినిల్లుగా ప్రసిద్ధి పొందిందన్నారు. పాలకులు వ్యవసాయం, రైతు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తే రైతును రాజు చేయడమనే లక్ష్యం నెరవేరినట్లేనని పేర్కొన్నారు.కార్యక్రమంలో అఖిల భారత జలవిభాగం విజయ భాస్కర్, ఇంకెవరూ మనకు జాగృతి ప్రముఖ్ అప్పాల ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి లావణ్య, భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు రావుల లింగారెడ్డి, ఉపాధ్యక్షులు కాసారపు భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బలరామ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఏవీ రంగారావు, సభ్యులు, రైతులు

ఒక కాయ.. నాలుగు కుడుకలు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): వినాయకుని వద్ద కొట్టిన కొబ్బరిలో నాలుగు కుడుకలు ఉండడం ఆశ్చర్యపరుస్తోంది. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత కొబ్బరి కాయ కొట్టగా నాలుగు కుడుకలు కనిపించడంతో భక్తులు దేవుని కృపనేనని భావిస్తున్నారు. కాగా ఒకే కొబ్బరిలో నాలుగు కుడుకల విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.



తంసా రాజన్న జోన్ అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్

కరీంనగర్ అర్బన్: తెలంగాణ పశుసంవర్ధక శాఖ మినిస్టీరియల్ సర్వీస్ అసోసియేషన్ రాజన్న జోన్–3 అధ్యక్షుడిగా జి.రాజేంద్రప్రసాద్(ఎఫ్ఎస్‌బీఎస్,కరీంనగర్)ను నియమించినట్లు ఎన్నికల అధికారి యం.జగన్ వెల్లడించారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాలతో రాజన్న జోన్ ఉండగా సదరు జోన్ ప్రకారం నూతనంగా ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. మూడేళ్ల పాటు పాలకవర్గం ఉంటుందని వివరించారు. ఉపాధ్యక్షుడిగా జి.అంబరీష్(కామారెడ్డి), కార్యదర్శిగా ఎ.హైమావతి(కరీంనగర్), సంయుక్త కార్యదర్శులుగా పి.శ్రీనివాస్(రాజన్న సిరిసిల్ల), పి.శ్రీలత(కామారెడ్డి), కోశాధికారిగా జి.మధు(సిద్దిపేట), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఈ.కాంత, కార్యవర్గ సభ్యులుగా ఎండీ.అజారుద్దీన్(మెదక్), టి.రమేశ్(రాజన్న సిరిసిల్ల), బి.వాణి(సిద్దిపేట)లను నియమించినట్లు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని తంసా రాష్ట్ర నేతలు గూడ ప్రభాకర్‌రెడ్డి, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డిలు అభినందించారు.


నియామక పత్రాలతో కార్యవర్గం

సగం ధరకే ఇసుక అంటూ మోసం

- డబ్బులు ఫోన్ పే చేయించుకున్న గుర్తు తెలియని వ్యక్తులు
- మల్లన్నపల్లిలో ఘటన

వీణవంక(హుజూరాబాద్): డీజిల్ లేక ట్రాక్టర్ మధ్యలో ఆగిపోయింది.. డీజిల్‌కి డబ్బులిస్తే సగం ధరకే ఇసుక తెచ్చిపోస్తాం.. పోలీసులు నిఘా పెంచిండ్రు.. అసలే ఇసుక దొరుకుతలేదంటూ అమాయక ప్రజలను నమ్మించి, డబ్బులు దండుకున్న ఘటన వీణవంక మండలంలోని మల్లన్నపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. బాధితుడి వివరాల ప్రకారం.. మల్లన్నపల్లికి చెందిన ఓ వ్యక్తి ఇంటికి మూడు రోజుల క్రితం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. మాది కోర్కల్ గ్రామమని, మా ఇసుక ట్రాక్టర్ డీజిల్ లేక మధ్యలో ఆగిపోయిందని నమ్మబలికారు. పోలీసోళ్లు చూస్తే ట్రాక్టర్‌ను పట్టుకుంటారని, రూ.4 వేలు ట్రిప్పు ఉన్న ఇసుక రూ.2 వేలకే పోస్తమని నమ్మించారు. దీంతో సదరు వ్యక్తి డబ్బులు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. క్యాష్ లేదని చెప్పడంతో నిందితులు ఓ ఫోన్ నంబర్ ఇవ్వగా రూ.2 వేలు ఫోన్ పే చేశాడు.

ఇసుక తీసుకురాకపోవడంతో..

రెండు రోజులు గడిచినా ఇసుక తీసుకురాకపోవడంతో అనుమానం వచ్చిన బాధిత వ్యక్తి విషయాన్ని సోమవారం గ్రామస్తులకు చెప్పాడు. ఫోన్ పే చేసిన నంబర్‌కు ఫోన్ చేసి, అడుగగా అది ఘన్ముక్కుల గ్రామంలోని ఓ కిరాణా దుకాణానికి సంబంధించినదని తేలింది. ఎంతోమంది ఫోన్ పే చేయించి, సరుకులు తీసుకుపోతారని దుకాణదారుడు తెలుపడంతో సదరు వ్యక్తి లబోదిబోమన్నాడు. గ్రామస్తులు నిందితుల కోసం ఆరా తీశారు. ఆ ఇద్దరిది కోర్కల్ గ్రామం కాదని భావిస్తున్నారు. వీణవంక, రెడ్డిపల్లిల్లోనూ ఇదే తరహాలో బురిడీ కొట్టించి, డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.